ఒకేనాటి రాత్రిలో

రాత్రి చాలప్రొద్దు పోయింది. సుమారు 11 గం॥ కావచ్చును. హేమా, యింకా తెలుగు పద్యాలు వల్లెవేస్తోంది. ఆమెకు రేపు తెలుగుపరీక్ష. అన్ని పరీక్షలు ఒకఎత్తు, తెలుగు పరీక్ష ఒకఎత్తు. అప్పుడు ఆమె నాన్నగారు, "హేమా! యింకా ఎంతసేపమ్మా చదువుతావు? యిలా చదివితే శరీరారోగ్యం పాడైపోదు! 11 గంటలవుతుంది. పోయి పడుకో తల్లీ, తెల్లవారుఝామునలేచి వల్లెవేద్దువుగానిలే, పో" అన్నారు. తండ్రిమాట కాదనలేక మనసులో చదువ వలెనని యున్నప్పటికి పుస్తకం మూసి పక్కమీద పండుకుంది. "రేపటితో పీడ అంతా వదలిపోతుందిరా, భగవంతుడా!" అని యిట్లా ఏదో ఆలోచిస్తూ కళ్లుమూసింది.

శోభ, ఆమె, ఒకేక్లాసులో చదువుతున్నారు. శోభఅంత గొప్పవాళ్ళ పిల్లకాదు. బీదవాళ్ళ పిల్లకాదు. మధ్య రకం. కాని చాలా అందముగా వుంటుంది. క్లాసులో మంచి మార్కులు కూడా తెచ్చుకుంటుంది. "పువ్వులతో గూడిన నారకు వాసన కలిగినట్లు" శోభతోకూడిన హేమాకుకూడ బాగా చదువాలని మంచిమార్కులు తీయాలని బుద్ధిపుట్టింది. కృషిచేయటం మొదలుపెట్టింది.

శోభ ఆమెతో చదువుచున్నప్పుడు వాళ్ళ అమ్మ చచ్చిపోయింది. ఆమె తండ్రి చాలమెత్తనివాడు. అమాయకుడు కూడాను. ఆఫీసులో ఏదో విధంగా నెగ్గుకొస్తున్నాడు. ఆయనకు శోభఒకతే ముద్దుబిడ్డ. ముద్దుగా పెంచుతున్నాడు. భార్య గతించిన తరువాత శోభ సంరక్షణార్థమై ఆమె తండ్రి మారుపెండ్లి చేసుకున్నాడు. శోభకు అప్పుడే పది సంవత్సరములు నిండినవి. తల్లి బాగా తెలుసుకాని, మారుతల్లి వచ్చి ఆమెను తల్లి సంగతి మరిపింప చేసింది. అంటే మారు తల్లి ఆమెను అంత ప్రేమగా చూసేది. శోభకు ఆమెను వదలి స్కూలుకు వెళ్ళటంకూడా దుష్కరమయ్యేది. స్కూలులో శోభ నాటకాలలోను ఆటలలోను మంచి మంచి బహుమానాలు, పేరుకూడా పొందింది. కాని ముందు ఏమి జరుగనున్నదో ఎవరెరుంగుదురు?

శోభ సవతి తల్లి మనసు పూర్తిగా మారిపోయింది. కారణం ఆమెకు ఒక కూతురుపుట్టింది. శోభవైపు ఆమె ప్రేమ, గారాబము విషంగా మారిపోయాయి. తియ్యని మాటలు బదులు తిట్లు వినబడుతున్నాయి. శోభకు కారణం ఏ మాత్రం తెలియలేదు. ఆమె మాత్రం తనకు చెల్లెలుపుట్టింది కదా అని ఎంతో సంతోషించింది. ఆమెను ఎక్కువగా ప్రేమించింది. కాని, చెల్లెలిని ఎత్తుకోవాలని వెళ్ళితే శోభకు దెబ్బలుకూడా తగిలేవి. యిప్పుడు ఆమెకు తల్లి, సవతి తల్లిలోని భేదభావం బాగా తెలిసింది. కాని శోభమీద సవతితల్లి అసూయ దినదినాభివృద్ధికావచ్చింది. చివరకు తన కూతురిని యెత్తుకొని మోయటంకొరకు ఆమె చదువు మాన్పించాలని చాలా పట్టుపట్టింది.

అప్పుడు శోభ ఒకరోజు :— పిన్నీ! నేనేం చేశానని నామీద అంతకోపంనీకు. నేను చెల్లెలిని నిద్రపుచ్చి యింట్లో అన్నిపనులు చేసిపెట్టి వెళ్ళి చదువుకుంటాను. చదువుసంధ్య లేకుండా యింట్లోచేతులు నులుపుకుంటూ కూర్చుంటే ఏమి లాభం? మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దానిని స్త్రీ పురుషులు కలసి పనిచేసి నిలబెట్టాలి. స్త్రీలు కూడా పురుషునివలె చదువుకుని పైకిరావాలి. అప్పుడే మనదేశం కూడా పైకిరాగలదు. పిన్నీ, నీ కాళ్ళుపట్టుకుంటాను పిన్నీ! నన్ను మన్నించి నా చదువు మాన్పించకు పిన్నీ! స్త్రీ పురుషులు, స్త్రీలు చదువుకొని పైకివచ్చినందువల్ల కలిగే లాభాలు తెలుసుకోవాలంటే నీవు ఎల్లుండి మా స్కూలులో నాటకం చూడడానికి రా! అందులో మన యింటి ప్రక్క వున్న జమీందారుగారమ్మాయి హేమా నాయకుడుగాను నేను నాయకిగాను వేస్తున్నాము. అందులో స్త్రీ విద్యవల్ల వచ్చే లాభాలను దేశమునకు తేటతెల్లముగా చూపిస్తాను. అందరూ వస్తారు పిన్నీ నువ్వుకూడా తప్పక రా! అది చూస్తే నువ్వే 'శోభా! నీవు కూడా చదువుకొని దేశ స్వాతంత్ర్యం నిలబెట్టమ్మా' అంటావు. అని మామూలు పిన్నే కదా అని గుక్కతిప్పకుండా అనివేసింది.

కాని మంచిమాటలుకూడా చెడ్డవారికి విషంగా కనుబడుతాయి. అప్పుడు "ఓసీ నీపని యింతవరకు వచ్చిందంటే

"కాని చూస్తానుగా" అని కళ్ళెఱ్ఱచేసి అక్కడనుంచి వెళ్ళి పోయింది. శోభగుండెల్లో రాయిపడింది. ఆమె తండ్రిఏమి చేయగలడు? అంకుశం అంతా ఆమె చేతిలోవుంది.

శోభ పెండ్లి. ఒక కురూపి, మూఢుడు అయిన ఒక యువకునితో నిశ్చయమయింది. శుభలేఖలు మాస్టర్లకు, పిల్లలకు చేరాయి. వారు సంతోషంతో కానుకలు తీసుకొని పెండ్లి సమయానికి వచ్చారు. అందరూ శోభ పెండ్లి చూచి ఆమె నాశీర్వదించి తమ తమ యిండ్లకు వెళ్ళి పోయారు. కాని రోడ్డుమీద వెళ్ళుతూ కొందరు శోభ స్నేహితులు, సహాధ్యాయినులు యిలా మాట్లాడుకున్నారు.

1 వ :—అదేమిటీ చారుమతీ? ఆ అందం, ఆ రూపు, ఆ నలుపు ఏ జంతువుకు పోల్చాలో నాకు తెలియటంలేదే? వారిద్దరి పెండ్లిని కాకి ముక్కుకి దొండపండు కట్టినట్లుగా వుందే. సరేకాని మన శోభ ఎట్లా ఒప్పుకుందే ఆ పెండ్లికి?

2 వ :—నీమొహం! అది ఒప్పుకోవటం ఏమిటీ? అది నాకు పెండ్లి వద్దందట! దానికి చదువంటేనే ఎక్కువయిష్టం. పెండ్లిమాట ఎత్తితే భగ్గున మండిపడేది. దాని ఆశయాలన్నీ చాలా పెద్దవిలే. యింతకు ఆ సవతితల్లిముండ వచ్చి యింత పని చేసింది. స్త్రీకాదంటే మంచి కార్యము చెయ్యాలన్నా చెడ్డది చేయ్యాలన్నా సాహసంకలది. శోభ చదువు మాన్పించి దాని నొక కురూపి కిచ్చి పెండ్లి చేసింది. పెండ్లి సమయంలో శోభమొహం ఎంత వాడిపోయిందో చూశావుగా! మన నాటకంలో శోభ హేమాల పెండ్లి కానేలేదు. కాని, రంగమణీ! వాళ్ళమ్మవుంటే యిల్లా చేసేదంటావా? పాపం ఆమె ఎప్పుడూ "మా శోభను బి.ఏ., వరకు చదివిస్తాను. ఆ తరువాత దానంతటదే స్వతంత్రంగా పెండ్లి చేసుకుంటుంది" అనేది. కాని విధి కృత్యము తప్పింప నెవ్వరి వశమే! అని శోభ భర్తను గురించి మాట్లాడుతూ వారు వారి యిండ్లు చేరిరి.

శోభకు పదకొండేండ్లయినా నిండలేదు. అప్పుడే ఆమెకు అత్తవారింటికి వెళ్ళవలసి వచ్చింది. కాని ఆమె మనస్సెల్లప్పుడు చదువు మీదనేవుండేది. సవతితల్లికి ఆమె యింటిలో వుండటం ఏ మాత్రం యిష్టంలేదు. అందుచేత పెండ్లి అయిన 5 నెలలకే అత్తవారింటికి పంపి వేసింది. "మూలిగే నక్కమీద తాటిపండు పడినట్లు" చదువుమాని వేశానని కుమిలి ఏడుస్తున్న శోభ మీద అత్తవారింటి వంట భారం కూడా నెత్తిమీద పడింది. ఆమెకు దేశవిషయాలు తెలుసుకోవటం పుస్తకాలు చదవటమే తెలుసుగాని వంట చేయటం అంత బాగా తెలీదు. అందులోను కుంచెడు తప్పాలా వార్చాలంటే మాటలా! శోభ తల్లి ఆమెకు చదువుకునేందుకు సమయము యిచ్చింది కాని వంటచేయుట కవకాశ మివ్వలేదు. వంట యింట్లోకి వెళ్ళేసరికి యింక :—

అత్తగారు :—ఏమే అస్తమానం పొయ్యి దగ్గరే పడి చస్తావేం, ఏగ్ఘూమయింది. యివ్వాక యివ్వాక వంట పని యిస్తే యివ్వాళ మమ్మల్నందరిని పస్తు పడుకో బెట్టేట్టుగా వున్నావు. ఆ, యింకా ఎక్కువ చదువుకుంటే ఎల్లావుండేదానివో? పిల్ల చక్కనిది, పనిపాటలు చక్కగా నేర్చినది, కొంచెము చదువుకున్నది అని అనుకుని బుట్టలో పడ్డాము. నీ చదువు. నీవు మండా! తొందరగా కానియ్యవే!

శోభ :—అత్తయ్యా! పచ్చి కట్టె పుల్లలవటం చేత పొయ్యిలోనుంచి పొగయే తప్ప మంట రావటం లేదండీ! అంతా నాదే తప్పనండి. కాని ఎందుకు చదువునలా తిడతారు? అది మన కందరకూ జ్ఞానం యిస్తోందనా? చదువు లేక పోవటంవల్లనే మనదేశం ముందుకు వెళ్ళలేక పోయింది. చదువుకుని విజ్ఞానం సంపాదించి మనం కూడా యితర దేశ స్త్రీలలాగ ముందుకు పోవాలి. యితరదేశాలలో చూడండి! అక్కడ బాల్య వివాహాలే లేవు, స్త్రీ బానిసత్వం లేనేలేదు, అంతా స్వేచ్ఛ. మరి మనదేశంలోనో, ఎవరైన ముందుకు రావటానికి ప్రయత్నిస్తే వారిని నిందిస్తోంది ప్రపంచం. వారికి ముందుకు పోవటానికి స్థానం యివ్వటంలేదు.

అని అత్తగారికి యింకా ఏవేవో చెప్పబోతుంటే అత్తగారు ఒక కఱ్ఱ బడిత పుచ్చుకొని "ఓసీ! నీవటే నాకు బుద్ధులు చెప్పవచ్చావు చచ్చినట్లు పడివుండక" అని తిట్టుతూ కఱ్ఱతో నాలుగంటించింది. యిది రోజూ జరిగేకథ. ఆమె భర్తకూడా తల్లికి తగిన కటిక మూఢుడు.

ఒకరోజు శోభయింట్లో ఏదో పనిచేస్తూంది. యింతలో ఆమె మరది (5 ఏండ్ల పిల్లవాడు) చేతిలో ఒక కవరుపుచ్చుకొని, "వదినా, నీకు వుత్తరం వచ్చిందొదినా" అంటూ

ఎగురుకుంటూ వీధిలోనుంచి వస్తున్నాడు. కాని యింతలో పిడుగులాగున శోభ భర్తవచ్చి తమ్ముడి చేతిలోనుంచి కవరు లాగుకొని చింపి చదువ నారంభించాడు. అందులో యిలా వ్రాసివుంది :—

నా ప్రియమైన పత్ని శోభకు.

'శోభా! నీవు నాకుతప్పక వుత్తరం వ్రాస్తాననిచెప్పావు. కాని నీవు అక్కడకు వెళ్ళిన తరువాత వుత్తరమే వ్రాయ లేదు. నీవు అట్లా వుత్తరమే వ్రాయక పోతే నా మనసు ఎంతో ఆదుర్దాగా వుండదూ? నీవు ఒక రోజు నాతో "హేమూ, యింక కొద్దిరోజుల్లో మనమిద్దరము ప్రజలందరి ఎదుట ఎంతో ఆనందంగా పెళ్ళిచేసుకో బోతున్నాము. ఎందుకు నీకు చింత? మన మిద్దరము ఏకమై దేశసేవ చేసి దేశంలోని స్త్రీ పురుషులకు వారు కూడా ఏకమై దేశ సేవ చేయాలని మచ్చు చూపిద్దాము" అని అన్నావు. కాని తానొకటి తలచిన దైవమొకటి తలచునని మన యిద్దరి పెండ్లి యింకా రెండు రోజులుండనగా నీ పెండ్లి అయి పోయింది. యిప్పుడు నీ క్రొత్త భర్తతో చాల హాయిగా వున్నావను కుంటాను. కాని నన్ను మాత్రం మరువకు. మనం పెండ్లిచేసు కొనక పోయినా పిల్లలచేత మాస్టరుచేత భార్యా భర్తలమని పించుకున్నాము. పేపర్లలో కూడా పడ్డాము. వెంటనే వుత్తరం వ్రాయి.'

యిట్లు
నీ భర్త హేము.

ఆ వుత్తరం చదవగానే శోభ భర్తకు కోపం ఆగలేదు. వెంటనే తను తల్లిదగ్గరకు పరుగెత్తుకుని వెళ్ళి వుత్తరం చూపించాడు. అగ్నికి గాలి సాయమైంది. వారికోపం మరీహెచ్చయింది. వెంటనే ఆమె తల్లి తండ్రులకు "మీ పిల్ల శీలం బాగాలేదు. ఆమె మాకక్కర లేదు. మా వంశానికి నాశకారిణి అయింది. కాబట్టి వెంటనేవచ్చి తీసుకొని వెళ్ళ"మని అర్జంటు టెలిగ్రాము యిచ్చారు. లోపల శోభ భర్త ఆమె దగ్గరకువెళ్ళి కోపావేశంతో ఒకకట్టతో ఒళ్ళుచితక బాదాడు. "ఓసీ ముండా, వాడినే పెండ్లి చేసి కొనక పోయావటే? మా యింటికి ఎందుకు వచ్చావు?" అని తిట్టినాడు. ఆమె దెబ్బలతో స్పృహతప్పి పడిపోయింది.

మధ్యాహ్నం తల్లి, తండ్రి జట్కాలో దిగారు. చెల్లెలు కూడా వుంది. అప్పుడే శోభకు కొంచెము తెలివి వచ్చింది. తండ్రి మాటవినగానే ఆమె గాయములు తగిలినమాట మరచి పోయి పరుగెత్తుకొని తండ్రి దగ్గరకుపోయి, "నాన్నగారు! యిన్నాళ్ళకు నా మీద దయకలిగిందా? అబ్బ! నేటి నా సంతోషమునకు మేరలేదు" అని తన చెల్లెలిని ఎత్తుకొని, "ఏం పిచ్చితల్లీ! నీ అక్కను మరచి పోయావా" అని అప్పుడు సవతి తల్లిని చూచి, "ఏం, పిన్నీ యిన్నాళ్ళకు నన్ను చూడాలని బుద్ధి పుట్టిందా? మన వూరిలో అందరు కులాసాగా యున్నారా? మన హేము వాళ్ళందరు కులాసాగా వున్నారా" అని గ్రుక్క తిప్పుకోకుండా ప్రశ్నలు వేయటం ప్రారంభించింది.

కాని తండ్రి ముఖంలో సంతోషంలేనేలేదు. వారికి టెలిగ్రాము చూడగానే సంగతేమిటో బోధపడ లేదు. యిటు మన శోభకు ఆ గొడవ తెలియదు. భర్త ఎందుకు తనను కొట్టాడా? అని వుద్దేశ్యము కూడా ఆమెకు లేదు. కాని తండ్రిని చూచి నివ్వెర పోయింది.

యింతలో ఆమె భర్తవచ్చి మామగారితో, "చూడండి మీ అమ్మాయి నడవడిక, ఎక్కువ చదివినందువల్ల లాభం చూచారా! ఎవరో హేముట! ఒక వుత్తరం వ్రాసాడు. అందులో స్పష్టంగా "నన్ను మరువకు ప్రియా"అని అంటూ వ్రాశాడు. వాడిని అడ్డంగా నరికినా పాపం లేదు. ఎంత సాహసం! కట్టుకున్న మొగుడు యిక్కడ వుండగానే ఇంత సాహస కార్యమా? కాని వాడి ననుకోవటం ఎందుకు? మీ అమ్మాయి వప్పుకోకపోతే వాడింత పనిచేస్తాడా! విషం అంతా మీ అమ్మాయిలోనే వుంది. మా యింటి దగ్గర దీని ఆటలు సాగవు. ఇదుగో! మామగారూ! ఆ అమ్మాయి నా భార్యాకాదు, మీరు నాకు మామగారు కాదు. మా వంశానికి నాశకారిణి అయి వచ్చింది. ఆమె ముఖము నేను యింక చూడను. మొట్ట మొదట ఆచేసే పెండ్లి, ఎవడో ఆ హేమూతోటే చెయ్యలేక పోయారా? పాపం వాళ్ళ పెండ్లి రెండురోజులలో తప్పిపోయిందట, పేపర్లలోకూడా పడిందట. కాని వాళ్ళపాలిటి శత్రువులాగ మధ్య నేనొ న్నాను. పాపం యిప్పుడీమెకోసం ఎంత ఏడుస్తూవుంటాడో

తీసుకువెళ్ళండి. ఒక క్షణం మా గుమ్మంలో ఉండడానికి వీలులేదు పొండి. మా యిల్లు యిప్పటివరకు పవిత్రంగావుంది. తొందరగా వెళ్ళిపొండి" అని శోభ భర్త గుక్క త్రిప్పుకోకుండా చెప్పటంవల్ల ఆమె తండ్రికి కూడా కొంచెము ఆమె మీద అనుమానం కలిగింది.

యిదిచూచి శోభ విషయం అంతా గ్రహించింది. అందుచేత ఆమె వారందరితో, "యిదుగో నిష్కల్మష హృదయంతో జరిగిన సంగతంతా చెపుతాను వినండి. నాలో ఏ విధమైన లోటూలేదు. నా శీలం పవిత్రమైనది. ఆ వుత్తరాన్ని మీరు సరిగా అర్థం చేసుకోలేదు. వుత్తరం యిట్లా వుండడానికి కారణ మేమిటంటే నేను చదువు చున్నప్పుడు మా స్కూలులో ఒక డ్రామావేద్దా మనుకున్నాము. అందులో "స్త్రీ పురుషులు చదువుకొని ఏకమై దేశ స్వాతంత్ర్యమును నిలబెట్టాలి" అని ప్రజలకు ఒక దంపతులు మచ్చు చూపుతారు. ఆ నాటకంలో నేను నాయకిగాను, హేమా అనే పిల్ల నాయకుడుగాను వేశాము. అందులో వివాహం కూడా చూపిస్తారు. యిది అంతా పేపర్లలో పడింది. స్కూలులో పిల్లలు మాస్టర్లు అంతా ఈ విధంగానే పిలచేవారు. అప్పుడు నాటకం యింకా రెండురోజులు వుందనగా మా పిన్ని పట్టుదలవల్ల నా వివాహం అయిపోయింది. ఆ అమ్మాయి హాస్యముగా అట్లా వుత్తరం వ్రాసింది. మీరు కూడా బాగా చదువుకుని వున్నట్లయితే యిటువంటి చిన్నచిన్న విషయము యింత పెద్దగొడవ చేయకవుండెడి వారే. మీరు అందులో చివర వ్రాసిన **आपकी प्यारी बहन** అనేది హిందీ అవటంచేత అది తెలుసుకొనలేక తప్పుడు అర్థము తీసుకున్నారు. యింతే జరిగిన విషయం."

ఆమె ఉద్రేక పూరితమయిన, విచారకరమైన మాటలు వినేసరికి అందరి మనసు మారిపోయింది. భర్త కోపమంతా చల్లారి పోయింది. నిజం తెలుసుకొన గలిగాడు. భర్త ఆమె యొక్క ఆశయాలను గుర్తించ గలిగాడు. స్త్రీ పురుషులు ఏకమై దేశ సేవ చేయాలని వారిద్దరు కంకణము కట్టారు. అలాగే దేశానికి మచ్చు చూపించారు. కురూపి అయితే నేమి, మంచి గుణములు కలిగిన తరువాత? వారిద్దరు సత్యమైన ప్రేమను దేశానికి చూపించారు. ఆనాడు శోభ నాటకం ద్వారా చూపించ లేక పోయినా ఈ నాడు ప్రత్యక్షంగా అందరకూ చూపించ గలిగింది. ఆమె ఆశయాలు పూర్తిగా నెరవేరినవి. పెండ్లి అంటే నిజమైన పెండ్లియిదే.

"హేమా" కళ్ళు తెరిచింది. కిటికీలోనుంచి సూర్యుడు ఆమెకు "యింకా లేవవేం? అందరూ లేచారు"అని కోప్పడుతున్నట్లుగా సూర్యకిరణాలు ఆమె మీద పడుతున్నాయి. పగలు 9 గంటలయినది. ఆమె కండ్లు ఎఱ్ఱగా నిప్పుముద్దలయి పోయాయి. ఆమె ప్రక్కనే శోభ తెలుగు పరీక్ష వ్రాయుటకు సిద్ధంగావచ్చింది. యింకా హేమా లేవలేదని ఆమెను లేపింది. అంతే కాని హేమాకు మెలకువ రాలేదు. తెలుగు పద్యాలు తెల్లవారు ఝామునలేచి వల్లెవేద్దా మనుకుంది. పాపం లేస్తూనే "శోభా! శోభా! ఎంత బాధపడుతున్నావు?"అంటూ వుండటమూ అదే సమయంలో ప్రక్కన వున్న శోభ ఆమె మాటలు విని పక్కున నవ్వడమూ జరిగాయి. యింతలో హేమాకు పూర్తిగా తెలివి వచ్చింది. అప్పుడు శోభ ఆమెతో "ఏమోయి! హేమా! తెలుగు పరీక్షలంటే నీకు ఎంతో భయంకదా? మరి ఎందుకు యింత ఆలస్యంగా లేచావు. రాత్రి 1 గంట వరకు మేలుకుని చదివావా?" అని ప్రశ్నించింది. అదివిని హేమా తనకు కల వచ్చింది కాని నిజంగా అదంతా జరగలేదని పెద్ద పెట్టున నవ్వ నారంభించింది. ఆ నవ్వువిని ఆఫీసు రూములో వ్రాసుకుంటూన్న వాళ్ళ నాన్నగారు వచ్చి,- "ఏం పిచ్చితల్లీ! రాత్రి అంత సేపు నిద్రలో ఏడ్చావు, ఏమైనా పీడకల వచ్చిందా?"అని అడిగాడు. అప్పుడు హేమా రాత్రి తను కలలో చూచిందంతా పూసగుచ్చినట్లు తండ్రికి, శోభకు వినిపించింది. తను నిజమే ననుకొని ఏడ్చిందట. శోభ తల్లి తండ్రి కులాసాగానే యున్నారు. తను మామూలుగా చదువుకుంటోంది. కాని హేమా అప్పుడు ప్రపంచంలో యిల్లాంటివి చాలా జరుగు తున్నాయని నమ్మింది.

ఇదంతా "ఒకే నాటి రాత్రిలో" జరిగిన కథ.

—కుమారి టి. శారద

★